సాక్షి కామారెడ్డి


ఆదివారం । 23 । మార్చి । 2025



వరిని వదలని మొగి

వరి పంటను మొగి పురుగు పట్టి పీడిస్తోంది. మందులు స్ప్రే చేసినా ఫలితం లేదని రైతులు పేర్కొంటున్నారు.

- 9లో ▸



రంజాన్ వేళలు

ఇఫ్తార్ ఆది : 6:34 | సహర్ సోమ : 4:55

గరిష్టం/కనిష్టం 38.4 /20.1

వాతావరణం

ఉదయం ఈదురు గాలులు వీస్తాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. పగటి ఉష్ణోగ్రతలు పెరిగే అవకాశాలున్నాయి. రాత్రి ఉక్కపోతగా ఉంటుంది.

న్యూస్‌రీల్

పరిశ్రమలు ఏర్పాటు చేయాలి

- అసెంబ్లీ సమావేశాల్లో జుక్కల్ ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు



నిజాంసాగర్: అత్యంత వెనకబడిన జుక్కల్ నియోజకవర్గంలో పరిశ్రమలు నెలకొల్పాలని ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు ప్రభుత్వాన్ని కోరారు. శనివారం ఆయన అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో మాట్లాడారు. శ్రామిక శక్తిలో, ఆర్థిక వ్యవస్థ అభివృద్ధిలో మహిళల భాగస్వామ్యం ఎనలేనిదన్నారు. మహిళలకు వ్యాపార రంగంలో అవకాశాలు ఇవ్వాలని, పరిశ్రమలను ఏర్పాటు చేసి వారిని భాగస్వాములను చేయాలని కోరారు. నియోజకవర్గంలో నిజాంసాగర్ ప్రాజెక్టుతోపాటు 150 చెరువులు ఉన్నాయని, ఫిష్ మార్కెటింగ్ సెంటర్ ఏర్పాటు చేస్తే ప్రయోజనకరంగా ఉంటుందని పేర్కొన్నారు. రాష్ట్రంలో అత్యధికంగా సోయా పంట పండే జుక్కల్ నియోజకవర్గంలో సోయా, చిరుధాన్యాల ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటు చేయాలని కోరారు. దీనిపై పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు సానుకూలంగా స్పందించారు. ఫిష్ మార్కెటింగ్ సౌకర్యంతోపాటు సోయా ఆధారిత పరిశ్రములు ఏర్పాటు చేయిస్తామని పేర్కొన్నారు.

'మత్స్యకారులకు ఇన్సూరెన్స్ తప్పనిసరి'



నిజాంసాగర్: చేపల వేటపై ఆధారపడి జీవిస్తున్న మత్స్యకారులకు ఇన్సూరెన్స్ తప్పనిసరని ఆ శాఖ జిల్లా అధికారి శ్రీపతి పేర్కొన్నారు. శనివారం అచ్చంపేట మత్స్యశాఖ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మత్స్యకారుల సదస్సులో ఆయన మాట్లాడారు. చేపల వేట సమయంలో సంభవిస్తున్న ప్రమాదాల్లో కార్మికులు మృత్యువాత పడుతున్నారన్నారు. ఈ నేపథ్యంలో వారి కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించేందుకు బీమా చేసుకోవాలన్నారు. మత్స్యకారుల అభివృద్ధికి ఉద్దేశించిన ప్రధానమంత్రి మత్స్య సంపద పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం జలయజ్ఞం ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఎఫ్‌డీవో డోలీసింగ్, ఫీల్డ్‌మెన్ నవీన్, అత్తర్, సంపత్, ఎల్లేష్, జయరాం తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న ఎస్సెస్సీ పరీక్షలు

కామారెడ్డి టౌన్: జిల్లాలో ఎస్సెస్సీ వార్షిక పరీక్షలు కొనసాగుతున్నాయి. శనివారం జరిగిన హిందీ పరీక్షకు 12,579 మంది విద్యార్థులకు గాను, 12,554 మంది హాజరయ్యారు. 25 మంది గైర్హాజరయ్యారు. ఎలాంటి మాల్ ప్రాక్టీస్ జరగకుండా పకడ్బందీగా పరీక్షలు నిర్వహిస్తున్నామని డీఈవో రాజు తెలిపారు.

వొకేషనల్ పరీక్షకు 60 మంది గైర్హాజరు

కామారెడ్డి టౌన్: జిల్లాలో శనివారం జరిగిన ఇంటర్మీడియట్ వొకేషనల్ పరీక్షకు 60 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. ఈ విషయాన్ని ఇంటర్మీడియట్ జిల్లా నోడల్ అధికారి షేక్ సలాం తెలిపారు. 1,123 మంది విద్యార్థులకుగాను 1,063 మందే పరీక్ష రాశారని పేర్కొన్నారు.

26న బల్దియా తైబజార్, మేకల సంత వేలం

కామారెడ్డి టౌన్: మున్సిపాలిటీ పరిధిలోని తైబజార్, మేకల సంతకు సంబంధించి ఈ నెల 26న బహిరంగ వేలం నిర్వహించనున్నారు. ఈ విషయాన్ని బల్దియా కమిషనర్ రాజేందర్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మున్సిపల్ కార్యాలయంలో 26న ఉదయం 11 గంటలకు బహిరంగ వేలం ఉంటుందని పేర్కొన్నారు. ఆసక్తిగలవారు వేలంలో పాల్గొనాలని, ఇతర వివరాలకు బల్దియా కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.


దెబ్బతిన్న పంటల వివరాలు సేకరించాలి

నిజామాబాద్ సిటీ: ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో అకాల వర్షాలకు దెబ్బతిన్న పంటల వివరాలను సేకరించాలని రాష్ట్ర రైతు కమిషన్ సభ్యుడు గడుగు గంగాధర్ వ్యవసాయ, ఉద్యానవన శాఖ అధికారులకు సూచించారు. యాసంగిలో సాగుచేస్తున్న పంటలు, అందులో వడగళ్ల వానకు దెబ్బతిన్న వాటి వివరాలు సేకరించాలని తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి కలెక్టర్లు, వ్యవసాయ అధికారులను అప్రమత్తం చేశారని పేర్కొన్నారు. వ్యవసాయ కమిషన్ రైతులకు అందుబాటులో ఉంటుందని హామీ ఇచ్చారు.

వ్యాపారంతో స్వయం సమృద్ధి

గ్రామీణ ప్రాంతాల్లో మహిళలు సొంతంగా వివిధ వ్యాపారాలు చేస్తూ స్వయం సమృద్ధి సాధిస్తున్నారు. స్వయం సహాయక సంఘాల సభ్యులు బ్యాంకు రుణాలు తీసుకుని చిరు వ్యాపారాలు ప్రారంభించి అనతికాలంలోనే వ్యాపారాభివృద్ధి చేసుకుంటూ ఆర్థికంగా నిలదొక్కుకుంటున్నారు. వచ్చిన ప్రతి అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటూ ఆదర్శంగా నిలుస్తున్నారు. జిల్లాలో పలువురు మహిళలు ఆర్థికంగా ఎదుగుతున్న తీరుపై 'సండే స్పెషల్'..

– సాక్షి ప్రతినిధి, కామారెడ్డి



- అవసరాలే వ్యాపార వనరులు
- ఆర్థికంగా నిలదొక్కుకుంటున్న మహిళలు

సండే స్పెషల్

మిల్లెట్స్ వ్యాపారం



దుకాణం నిర్వహిస్తున్న యాస్మిన్

బీర్కూర్ మండల కేంద్రానికి చెందిన యాస్మిన్ బేగం కుటుంబానికి పిండి గిర్నీ ఉంది. తోడుగా ఏదైనా వ్యాపారం చేయాలనుకుని రాగులు, జొన్నలు తదితర మిల్లెట్స్ వ్యాపారం మొదలుపెట్టింది. రోజుకు రూ.3వేల నుంచి రూ.5వేల వరకు వ్యాపారం నడుస్తోంది. దీని ద్వారా రోజుకు రూ. 800 నుంచి రూ.900 సంపాదిస్తున్నారు. నాలుగు చక్రాల రవాణా వాహనం కొనుగోలు చేశారు. సొంతంగా అటుకులు, పేలాలు, బఠానీలు, చుడువా అటుకులు తయారు చేస్తున్నారు. పేలాల రోస్టర్ మిషన్ తీసుకోవాలని భావిస్తున్నట్లు యాస్మిన్ బేగం తెలిపారు.

టైలరింగ్‌తో..

భిక్కనూరు మండల కేంద్రానికి చెందిన గొల్ల శైలజ మొదట రూ. 50 వేలు లోన్ తీసుకుని కుట్టుమిషన్ కొనుగోలు చేశారు. టైలరింగ్ చేయడంతో పాటు బ్లౌజ్‌పీసులు విక్రయించారు. తర్వాత వ్యాపార వృద్ధిలో భాగంగా వస్త్రాల అమ్మకం ప్రారంభించారు. పీకో మిషన్ కూడా కొనుగోలు చేశారు. బట్టలతో పాటు బ్యాంగిల్స్ విక్రయిస్తుస్తూ ఉపాధి పొందుతున్నారు. ఆమెకు ముగ్గురు పిల్లలున్నారు. వారికి మంచి భవిష్యత్‌కోసం కష్టపడుతున్నట్లు శైలజ తెలిపారు.



వస్త్ర దుకాణాన్ని నిర్వహిస్తున్న గొల్ల శైలజ

పిండివంటలతో..



తయారు చేసిన పిండివంటలతో చెన్నమనేని ప్రమీల

బీబీపేట మండలం యాడారం గ్రామానికి చెందిన చెన్నమనేని ప్రేమల ఆర్డర్‌పై పిండి వంటలు తయారు చేస్తూ ఉపాధి పొందుతున్నారు. స్వయం సహాయక సంఘాల ద్వారా వివిధ సందర్భాల్లో రూ. 8.49 లక్షలు అప్పు తీసుకున్నామని ప్రేమల తెలిపారు. పిండి వంటలు చేస్తూ రుణభారం తగ్గించుకుంటున్నామన్నారు. ఇంకా రూ. 3.60 లక్షల అప్పు ఉందన్నారు. వ్యాపారాన్ని అభివృద్ధి చేసుకోవడంతోపాటు పిల్లలను ఉన్నతంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా సాగుతున్నానన్నారు.

ఎల్లారెడ్డి మండలం కల్యాణి గ్రామానికి చెందిన సౌజన్య స్వయం సహాయక సంఘం సభ్యురాలిగా చేరిన తరువాత కుటుంబ ఎదుగుదలకు తనవంతు శ్రమించారు. సంఘం, బ్యాంకు లింకేజీ రుణాలు తీసుకుని కిరాణా దుకాణం పెట్టుకున్నారు. తర్వాత టీ, టిఫిన్ సెంటర్ కూడా ఏర్పాటు చేసుకున్నారు. ఆమె భర్త టెంట్ హౌస్ నిర్వహిస్తారు. ఇద్దరు కలిసి వ్యాపారాల్లో రాణిస్తున్నారు. భవిష్యత్తులో వ్యాపారం మరింత వృద్ధి చేసుకోవాలని అనుకుంటున్నట్లు సౌజన్య తెలిపారు.

కిరాణా దుకాణంతో..



కిరాణా దుకాణం నిర్వహిస్తున్న సౌజన్య

రాఖీల తయారీలో శిక్షణ..



రాఖీల తయారీపై శిక్షణ ఇస్తున్న గీత

భిక్కనూరు మండలం బస్వాపూర్‌కు చెందిన బాసం గీత స్వయం సహాయక సంఘంలో చురుకుగా పాల్గొంటున్నారు. ఆమె భర్త టైలరింగ్ చేస్తుండగా, గీత మహిళా సంఘాలకు సంబంధించిన పుస్తకాలు రాస్తూ ఉపాధి పొందారు. బుక్ కీపర్, ఆడిటర్ శిక్షణ కూడా తీసుకున్నారు. భార్యాభర్తలిద్దరు కష్టపడుతూ పిల్లల్ని చదివిస్తున్నారు. గాజులు, రాఖీల తయారీలో శిక్షణ పొందారు. భవిష్యత్తులో గాజులు, రాఖీల తయారీ యూనిట్ ఏర్పాటు చేస్తానని గీత పేర్కొంటున్నారు.

బ్యాంగిల్ స్టోర్‌తో ఉపాధి



పాల్వంచ మండలం ఫరీదుపేటకు చెందిన యెంకొళ్ల మంజుల భర్తతో కలిసి కూరగాయలు సాగు చేయడం ద్వారా కొంతకాలం ఉపాధి పొందారు. తర్వాత గ్రామంలో బ్యాంగిల్ స్టోర్ ఏర్పాటు చేశారు. దుస్తులు కుడుతున్నారు. ఆసక్తిగల వారికి దుస్తులు కుట్టడంతో శిక్షణ కూడా ఇస్తున్నారు. షాప్ ఏర్పాటు కోసం మహిళా సంఘం నుంచి రూ. 9 లక్షల అప్పు తీసుకున్నానని మంజుల తెలిపారు. వ్యాపారం ద్వారా వచ్చిన డబ్బుతో అప్పు తీరుస్తున్నామన్నారు. ఇంకా రూ. 2.46 లక్షల అప్పు ఉందన్నారు. వ్యాపారాన్ని మరింత వృద్ధి చేసుకోవాలనుకుంటున్నట్లు తెలిపారు.

మా గ్రామాన్ని రక్షించండి

- అదనపు కలెక్టర్, సబ్ కలెక్టర్‌తో గోపన్‌పల్లివాసులు
- కాలుష్యంతో రోగాలబారిన పడుతున్నామని ఆవేదన



డాంబర్ ప్లాంటును పరిశీలిస్తున్న అధికారులు

బిచ్కుంద(జుక్కల్): ''మా గ్రామ శివారులో ఏర్పాటు చేసిన డాంబర్ ప్లాంట్, స్టోన్ క్రషర్‌తో క్యాన్సర్, ఊపిరితిత్తుల వ్యాధులబారిన పడుతున్నాం. మమ్మల్ని రక్షించండి'' అంటూ గోపన్‌పల్లి గ్రామస్తులు అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, బాన్సువాడ సబ్ కలెక్టర్ కిరణ్మయిలను వేడుకున్నారు. ప్రజాభిప్రాయ సేకరణ కోసం శనివారం గ్రామానికి వచ్చిన అధికారులకు ప్లాంట్లపై ఫిర్యాదులు చేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ బిచ్కుంద శివారులో అనుమతి తీసుకొని తమ గ్రామానికి సమీపంలో డాంబర్ ప్లాంట్, స్టోషన్ క్రషర్ ఏర్పాటు చేశారన్నారు. వాటి నుంచి వెలువడుతున్న కాలుష్యంతో 15 ఏళ్లుగా పిల్లలు, వృద్ధులు శ్వాస సంబంధిత సమస్యలు ఎదుర్కొంటున్నారన్నారు. గతేడాది నిర్వహించిన ప్రజాభిప్రాయ సేకరణలో గ్రామస్తులంతా ప్లాంట్ నిర్వహణను వ్యతిరేకించినా అధికారులు పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్లాంట్ల అనుమతులు రద్దు చేయకపోతే గ్రామాన్ని ఖాళీ చేయించి వేరే చోట స్థలం చూపించాలన్నారు. మండల ప్రత్యేకాధికారిగా మైన్స్ ఏడీ ఉన్నప్పటికీ అక్రమ తవ్వకాలను పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ ప్లాంట్ నిర్వాహకులు రెండు రోజుల్లో సంబంధిత పత్రాలను బాన్సువాడ సబ్ కలెక్టర్‌కు సమర్పించాలని ఆదేశించారు. కాలుష్య నియంత్రణ, ఇతర శాఖల అధికారులతో విచారణ చేపట్టి సమస్యను పరిష్కరిస్తామని గ్రామస్తులకు హామీ ఇచ్చారు. అంతకుముందు అధికారులు ప్లాంట్‌ను సందర్శించి ప్రభుత్వ అనుమతులు ఉన్నాయా, నిబంధనల మేరకు నిర్వహిస్తున్నారా అన్న అంశాలను పరిశీలించారు.

'శవ రాజకీయాలు మానండి'

బాన్సువాడ: నియోజకవర్గంలో కొందరు శవ రాజకీయాలు చేస్తున్నారని ఆగ్రో ఇండస్ట్రీస్ చైర్మన్ కాసుల బాల్‌రాజ్ విమర్శించారు. శనివారం ఆయన బాన్సువాడలో విలేకరులతో మాట్లాడారు. పోచారం శ్రీనివాస్‌రెడ్డికి వ్యతిరేకంగా కొందరు కాంగ్రెస్ నాయకులు నిజామాబాద్ కలెక్టర్ వద్ద ధర్నా చేయడాన్ని తప్పుపట్టారు. బీర్కూర్ మండలం దామరంచకు చెందిన కాంగ్రెస్ నాయకుడు ఇక్బాల్ అనారోగ్యంతో మరణిస్తే.. కొత్తగా కాంగ్రెస్‌లో చేరిన వారు ఇబ్బందులు పెట్టడంతోనే చనిపోయినట్లుగా చిత్రీకరించడాన్ని ఖండించారు. ఈజీఎస్ పనులు కాంగ్రెస్ కార్యకర్తలకే అప్పగిస్తున్నామన్నారు. నియోజకవర్గంలో మార్కెట్ కమిటీ చైర్మన్లను పాత కాంగ్రెస్ నాయకులకే ఇచ్చామని గుర్తు చేశారు. ఎల్లారెడ్డి నుంచి వచ్చిన రవీందర్‌రెడ్డి, హైదరాబాద్‌లో ఉండే యలమంచలి శ్రీనివాస్‌రావు పార్టీకోసం పని చేయాలిగానీ ఇలాంటి రాజకీయాలు చేయవద్దని హితవు పలికారు. సమావేశంలో నాయకులు శంకర్, కాశీరాం, ఖాలేక్, మధుసూదన్‌రెడ్డి, అసద్, అఫ్రోజ్, సురేశ్‌గుప్తా, హన్మండ్లు, ఖమ్రొద్దీన్, ఎజాస్, రాజు, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కాసుల బాల్‌రాజ్

బొందలగడ్డకు రైతుబంధు!

- రికార్డులు మార్చి పట్టాలు పొందిన వైనం
- చర్యలు తీసుకోవాలని కోరుతున్న తెల్గాపూర్‌వాసులు



తెల్గాపూర్ శివారులోని శ్మశానవాటిక

నిజాంసాగర్ : దశాబ్దాలుగా శ్మశానానికి ఉపయోగిస్తున్న అసైన్డ్, పరంపోగు భూములపై కొందరు కన్నేశారు. రికార్డులు మార్చి పట్టాలు పొందడమే కాకుండా ఏళ్లుగా రైతుబంధును తీసుకుంటూ లబ్ధి పొందుతున్నారు. మహమ్మద్‌నగర్ మండలంలోని తెల్గాపూర్ గ్రామశివారులో ఉన్న అసైన్డ్, పరంపోగు భూములను కొన్నేళ్ల క్రితం శ్మశానం, బొందలగడ్డకు కేటాయించారు. దీంతో అప్పటి నుంచి గ్రామంలో ఎవరైనా మరణిస్తే ఆ భూముల్లోనే సమాధి చేస్తున్నారు. గత ప్రభుత్వం కొత్త పట్టాదారు పాసుబుక్కులు జారీ చేయడంతో ఓ గ్రామ రెవెన్యూ అధికారి సహకారంతో రెండు కుటుంబాలు ఆ భూములను తమ పేరిట పట్టా చేయించుకున్నాయి. 310 సర్వే నంబరుతోపాటు 310 /2, 312, 313, 315, 316, 317, 318 సర్వే నంబర్లల్లో ఉన్న దాదాపు 10 ఎకరాల భూములకు పట్టాలు పొందారు. ఆ భూములలో పెద్దపెద్ద బండరాళ్లు, భారీ వృక్షాలున్నాయి. 2018 సంవత్సరం నుంచి ఆ భూములకు రైతుబంధు అందుతోంది.

భూకబ్జాపై ఆందోళనలు

బొందలగడ్డ భూములను పట్టా చేయించుకోవడంతోపాటు రైతుబంధు చెల్లింపులపై గ్రామస్తులు ఆందోళనబాట పట్టారు. తెల్గాపూర్ వాసులంతా ఇటీవల మహమ్మద్‌నగర్ తహసీల్ కార్యాలయాన్ని ముట్టడించారు. ఈ విషయాన్ని బాన్సువాడ సబ్ కలెక్టర్ కిరణ్మయి దృష్టికి తీసుకువెళ్లారు. త్వరలోనే ప్రజావాణిలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేయనున్నట్లు గ్రామస్తులు తెలిపారు.

పట్టాలు సృష్టించారు



మా తాతతోపాటు గ్రామంలోని పెద్దలు మరణిస్తే బొందలు ఇక్కడే పెట్టాం. రెవెన్యూ అధికారుల సహకారంతో కొందరు రికార్డులు మార్చి, పట్టాలు సృష్టించారు. భూముల్లేనోళ్ల అంత్యక్రియలు చేసేందుకు జాగలేకుండా చేస్తే ఊరుకోం.

– కుమ్మరి దస్తయ్య, తెల్గాపూర్

చర్యలు తీసుకోవాలి



మా అవ్వ (లచ్చవ్వ) మరణిస్తే ఇక్కడే బొందపెట్టినం. నాకు ఇప్పుడు అరవై ఏళ్లు. నా చిన్నప్పటి నుంచి బొందలగడ్డగానే చూస్తున్నాం. ఇప్పుడు కొత్తగా పట్టా పాసు బుక్కులతోపాటు రైతుబంధు ఇస్తున్నరంటే నమ్మలేకపోతున్నా. దీనిపై చర్యలు తీసుకోవాలి.

– మేడిపల్లి లక్ష్మయ్య, తెల్గాపూర్

'నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తీసుకోండి'



మాట్లాడుతున్న జిల్లా జడ్జి వరప్రసాద్, పక్కన కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

కామారెడ్డి క్రైం: నిబంధనలు పాటించని స్కానింగ్ సెంటర్లపై కఠిన చర్యలు తీసుకోవాలని జిల్లా జడ్జి డాక్టర్ సీహెచ్‌వీఆర్‌ఆర్ వరప్రసాద్ అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లో జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో 'గర్భస్థ పిండ లింగ నిర్ధారణ పరీక్షా చట్టం' అమలుపై జిల్లా స్థాయి కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా జడ్జి వరప్రసాద్ మాట్లాడుతూ మాట్లాడుతూ స్కానింగ్ కేంద్రాల్లో రికార్డుల నిర్వహణ పకడ్బందీగా ఉండేలా చూడాలన్నారు. నిబంధనలు పక్కాగా అమలయ్యేలా పర్యవేక్షించాలని వైద్యాధికారులకు సూచించారు.

లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే చర్యలు..

లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తున్న స్కానింగ్ కేంద్రాలపై చట్టపరమైన చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ ఆదేశించారు. స్కానింగ్ కేంద్రాలను తరచుగా వైద్య శాఖ అధికారులు తనిఖీ చేయాలన్నారు. నిబంధనలు పాటించని కేంద్రాల గుర్తింపు రద్దు చేయాలని సూచించారు. రిజిస్ట్రేషన్ లేకుండా ఏవైనా ఆస్పత్రులను నిర్వహిస్తుంటే వెంటనే నోటీసులు జారీ చేయాలన్నారు. ఆర్‌ఎంపీలపై నిఘా పెంచాలన్నారు. అర్హత లేకుండా ఆస్పత్రులు నిర్వహిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మందుల చీటీ లేకుండా మందులు ఇస్తున్న మెడికల్ షాప్‌లపైన చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో ఏఎస్పీ నరసింహారెడ్డి, డీఎంహెచ్‌వో చంద్రశేఖర్, ప్రోగ్రాం అధికారులు శిరీష, విద్య, ప్రభు కిరణ్, ఐఎంఏ కార్యదర్శి అరవింద్, అధికారులు వేణుగోపాల్, చలపతి పాల్గొన్నారు.

'ఎల్‌ఆర్‌ఎస్‌పై దృష్టి సారించాలి'

కామారెడ్డి క్రైం: ఎల్‌ఆర్‌ఎస్, ఇంటి పన్నుల వసూళ్లపై అధికారులు దృష్టి సారించాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ సూచించారు. శనివారం కలెక్టరేట్‌లోని తన క్యాంప్ కార్యాలయంలో మున్సిపల్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 31 లోగా ఇంటి పన్నుల వసూళ్లను వంద శాతం పూర్తి చేయాలన్నారు. ఎల్‌ఆర్‌ఎస్ ఫీజులు, ఇంటి పన్నుల వసూళ్ల కోసం నెలాఖరు వరకు సెలవు దినాలతో సహా ప్రతి రోజు కార్యాలయాలను తెరచి ఉంచాలన్నారు. దరఖాస్తు చేసుకున్న వారందరూ రెగ్యులరైజ్ చేసుకునేలా ఎల్‌ఆర్‌ఎస్‌పై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. సమావేశంలో మూడు బల్దియాల కమిషనర్‌లు రాజేందర్‌రెడ్డి, హేమంత్ రాజు, మహేశ్, టీపీవోలు, ఆర్‌ఐలు పాల్గొన్నారు.

వడగళ్ల వానతో పంట నష్టం

గాంధారి: మండలంలోని పలు గ్రామాల్లో శనివారం సాయంత్రం ఉరుములు, మెరుపులు, ఈదురు గాలులతో కూడిన వర్షం కురిసింది. తిప్పారం, తిప్పారం తండా, గొల్లాడి తండా, సోమారం తండా తదితర తండాల్లో వడగళ్లు పడ్డాయి. దీంతో కోతకొచ్చిన జొన్న, మొక్కజొన్న పంటలు నేలకొరిగాయి. గొల్లాడి తండా శివారులో వందల ఎకరాల జొన్న పంటకు నష్టం జరిగింది.

పంటల పరిశీలన

సదాశివనగర్: మండల కేంద్రంతో పాటు అడ్లూర్ ఎల్లారెడ్డి, కుప్రియాల్, మర్కల్, తిర్మన్‌పల్లి, ధర్మారావ్‌పేట్‌లలో శుక్రవారం కురిసిన వర్షానికి దెబ్బతిన్న పంటలను వ్యవసాయ విస్తీర్ణాధికారులు పరిశీలించారు. మండలంలో 42 ఎకరాల్లో పంట నష్టం జరిగినట్లు ఏవో ప్రజాపతి తెలిపారు.

భిక్కనూరు: అంతంపల్లి శివారులో శుక్రవారం కురిసిన వర్షానికి దెబ్బతిన్న పంటలను జిల్లా వ్యవసాయాధికారి తిరుమల ప్రసాద్ పరిశీలించారు. పంట నష్టపోయిన రైతులతో మాట్లాడారు. ఆయన వెంట ఏడీఏ అపర్ణ, ఏఈవో లిఖిత్‌రెడ్డి, రైతులు ఉన్నారు. లక్ష్మీదేవునిపల్లి గ్రామానికి చెందిన సుభాన్‌రెడ్డికి చెందిన వందకుపైగా బొప్పాయి చెట్లు గాలిదుమారంతో నేలకూలాయి.

రాజంపేట: రాజంపేట, ఆరేపల్లి, బసవన్నపల్లి, అరగొండ గ్రామాలలో వర్షంతో దెబ్బతిన్న మక్క, వరి పంటలను వ్యవసాయాధికారులు పరిశీలించారు. 26 ఎకరాలలో మొక్కజొన్న పంట నేలవాలిందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏవో శ్రుతి, ఏఈవోలు శిల్ప, సవిత, బాలకిషన్ పాల్గొన్నారు.

ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డి పట్టణంలో శుక్రవారం రాత్రి 9.3 మిల్లీమీటర్ల వర్షం కురిసిందని రెవెన్యూ అధికారులు తెలిపారు.



అంతంపల్లిలో వివరాలు తెలుసుకుంటున్న డీఏవో తిరుమల ప్రసాద్





ఆరెపల్లిలో దెబ్బతిన్న పంటలను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారులు, అడ్లూర్ ఎల్లారెడ్డిలో..



గొల్లాడి తండాలో నేలకొరిగిన జొన్న పంట

క్లుప్తంగా

వేతనాలు చెల్లించాలని జీపీ కార్మికుల ధర్నా


ధర్నా చేస్తున్న జీపీ కార్మికులు

కామారెడ్డి టౌన్: గ్రామపంచాయతీ సిబ్బందికి బకాయి వేతనాలను తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేస్తూ గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో శనివారం కలెక్టరేట్ ముందు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షుడు వెంకట్ గౌడ్, జిల్లా అధ్యక్షుడు బాలనర్సులు మాట్లాడుతూ గత తొమ్మిది నెలలుగా వేతనాలు చెల్లించకపోవడంతో కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు.ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్ నాయకులు బి.సాయిలు, రూప్‌సింగ్, సాయిలు, కిషన్, కీర్తి, తదితరులు పాల్గొన్నారు.

పదో తరగతి విద్యార్థులకు ఉచిత రవాణా సౌకర్యం


విద్యార్థులతో ఆటో డ్రైవర్లు

దోమకొండ: పదోతరగతి విద్యార్థులకు పరీక్షలు కొనసాగుతున్నాయి. మండలంలోని అంబారిపేట గ్రామ ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు 10 కిలోమీటర్ల దూరంలోని బీబీపేట మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పరీక్ష కేంద్రం సెంటర్ పడింది. విద్యార్థులకు పరీక్ష రాయడానికి వీలుగా గ్రామానికి చెందిన యువకుడు అరుట్ల అనిల్ తన సొంత డబ్బులతో నాలుగు ఆటోలను ఏర్పాటు చేశాడు. ఉచిత ఆటో రవాణా సౌకర్యం కల్పించిన సదరు యువకుడిని పాఠశాల ఉపాధ్యాయుడు, గ్రామస్తులు అభినందించారు.

మున్సిపాలిటీ వద్దు జీపీ ముద్దు

- ప్రజాభిప్రాయ సేకరణలో గోపన్‌పల్లివాసులు
- ఉన్నతాధికారులకు నివేదిస్తామన్న అడిషనల్ కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి


మాట్లాడుతున్న అడిషనల్ కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి

బిచ్కుంద(జుక్కల్): కొత్తగా ఏర్పాటు కానున్న బిచ్కుంద మున్సిపాలిటీలో గోపన్‌పల్లి గ్రామాన్ని కలపడం విషయమై శనివారం అధికారులు గ్రామంలో ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించారు. అడిషనల్ కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, బాన్సువాడ సబ్ కలెక్టర్ కిరణ్మయి ఆధ్వర్యంలో గ్రామ చావడి వద్ద గ్రామ సభ ఏర్పాటు చేశారు. మున్సిపాలిటీ వద్దు జీపీ ముద్దు.. జీపీతో అన్ని సాధించుకుంటామని ప్రజలు తమ అభిప్రాయాలు వ్యక్తం చేశారు. ఉపాధి హామీ పనుల నుంచి దూరం కావాల్సి వస్తుందని, అన్ని రకాల పన్నులు పెరిగిపోతాయని, అందరి ఏకాభిప్రాయంతో గ్రామ పంచాయతీగా ఉంచాలని నిర్ణయించుకున్నామని గ్రామస్తులు అధికారులకు నివేదించారు. ప్రభుత్వానికి పంపించిన ప్రతిపాదనలు వెనక్కి తీసుకోవాలని జీపీగా ఉంచాలని ప్రజలు కోరారు. ఈ సందర్భంగా అడిషనల్ కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ మున్సిపాలిటీతో గ్రామంలో జరిగే అభివృద్ధి తదితర అంశాలపై అవగాహన కల్పించారు. గ్రామస్తుల అభిప్రాయాలను అధికారులకు నివేదిస్తామని తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ వేణుగోపాల్, ఎంపీడీవో గోపాల్ తదితరులున్నారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు ప్రారంభించాలి


గాంధారిలో జీపీ కార్యదర్శులతో సమీక్షిస్తున్న డీపీవో మురళి

గాంధారి(ఎల్లారెడ్డి): మండల పరిధిలోని బ్రాహ్మణపల్లిలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు మార్కింగ్ చేసి నిర్మాణాలు ప్రారంభించాలని డీపీవో, మండల ప్రత్యేకాధికారి మురళి అన్నారు. శనివారం ఆయన మండలాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో రాజేశ్వర్, ఎంపీవోలక్ష్మి నారాయణ, ఏఈలు దామోదర్, భాను చందర్, ఏపీవో శ్రుతి తో కలిసి పంచాయతీ కార్యదర్శులు, ఉపాధిహామీ సిబ్బందితో సమీక్షించారు. పలు విషయాలపై చర్చించి సూచనలు చేశారు.కార్యక్రమంలో జీపీ కార్యదర్శులు, ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.

బీబీపేట/నాగిరెడ్డిపేట : బీబీపేట మండలం శివారు రాంరెడ్డిపల్లి, నాగిరెడ్డిపేట మండలం అచ్చాయపల్లిలో కొనసాగుతున్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను మండల ప్రత్యేకాధికారి శ్రీనివాస్, ఎంపీడీవో ప్రభాకరచారి పరిశీలించారు. శనివారం గ్రామాల్లోని ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ముగ్గు పోశారు. అనంతరం యాడారం గ్రామంలో నర్సరీ, తాగునీటి వసతులను పరిశీలించారు. బీబీపేట లో ఉన్నటువంటి నర్సరీలో పెరుగుతున్న మొక్కలను పరిశీలించి తగిన సలహాలు ఇచ్చారు. మల్కాపూర్‌లో జరుగుతున్న సీసీ రోడ్ల పనులను సందర్శించారు. ఆయన వెంట ఎంపీడీవో పూర్ణచంద్రోదయ కుమార్, కార్యదర్శి వెంకట స్వామి, పంచాయతీ కార్యదర్శి వెంకటరాములు, ఫీల్డ్అసిస్టెంట్ మల్లేశం తదితరులున్నారు.

చలో హైదరాబాద్‌ను విజయవంతం చేయాలి



బాన్సువాడ : ఆశ వర్కర్ల సమస్యల పరిష్కారానికి సోమవారం నిర్వహించే చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా గౌరవ అధ్యక్షులు రవీందర్ అన్నారు.ఆశవర్కర్ల సమస్యలపై అసెంబ్లీలో చర్చించి రూ.18 వేల వేతనం ఇవ్వాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని తదితర డిమాండ్లతో చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని చేపట్టనున్నట్లు ఆయన అన్నారు. ఈ సమావేశంలో ఆశ వర్కర్లు లావణ్య, గంగమణి, అనురాధ, వరలక్ష్మి తదితరులు ఉన్నారు.

స్కూల్ యూనిఫామ్స్ స్టిచ్చింగ్‌తో ఆర్థికంగా ఎదగాలి

కామారెడ్డి రూరల్: మహిళా సంఘాల సభ్యులు ప్రభుత్వ పాఠశాలల యూనిఫామ్స్ స్టిచ్చింగ్‌తో ఆర్థికంగా ఎదగాలని డీపీఎం రమేష్ బాబు సూచించారు. శనివారం కామారెడ్డి మండల సమాఖ్య కార్యాలయంలో రెండవ రోజు 11 మండలాలకు చెందిన వారిలో మండలానికి ఆరుగురి చొప్పున శిక్షణను ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడారు. ఏపీఎంలు రాజేందర్, టీవోటీలు, రాజేశ్వరీ, సల్మా, 11 మండలాలకు చెందిన మహిళ సంఘ సభ్యులు పాల్గొన్నారు.

బార్ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ ప్రారంభం

ఖలీల్‌వాడి: నిజామాబాద్ బార్ అసోసియేషన్ ఎన్నికలకు సంబంధించి నామినేషన్ల ప్రక్రియ శనివారం ప్రారంభమమైంది. ఎన్నిక అధికారు లు వెంకటేశ్వర్, ఆర్ఎస్ఎల్ గౌడ్ జిల్లా కోర్టు ప్రాంగణంలోని బార్ ఎన్నికల కార్యాలయంలో నామినేషన్లు స్వీకరించారు.మార్చి 26వరకు నామినేషన్ పత్రాలను స్వీకరిస్తామని చెప్పారు.

అక్రమ ఇళ్ల నిర్మాణాలపై బీజేపీ ధర్నా


బాన్సువాడలో అడిషనల్ కలెక్టర్, సబ్ కలెక్టర్లకు వినతి పత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు

బాన్సువాడ : మున్సిపాలిటీ పరిధిలో ఎలాంటి అనుమతులు లేకుండా ఇళ్లు నిర్మించారని, అక్రమంగా నిర్మించిన ఇళ్లను కూల్చేవేయాలని డిమాండ్ చేస్తూ శనివారం మున్సిపల్ కార్యాలయం ముందు బీజేపీ నాయకులు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు మాట్లాడుతూ పట్టణంలో అక్రమంగా ఇళ్ల నిర్మాణాలు కొనసాగుతున్న మున్సిపల్ అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. మున్సిపల్‌కు కేటాయించి 10 శాతం స్థలాలను మున్సిపల్ స్వాధీనం చేసుకోవాలని, ఖాళీ స్థలాలకు ఇళ్ల స్థలాలు కేటాయించారని ఆరోపించారు. అనంతరం అడిషనల్ కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డికి, సబ్ కలెక్టర్ కిరణ్మయికి వినతి పత్రం అందజేశారు.కార్యక్రమంలో బీజేపీ నాయకులు శ్రీనివాస్, మజ్జిగ శ్రీనివాస్, హరి, సాయికిరణ్, లక్ష్మీనారాయణ, కోనాల గంగారెడ్డి, శేఖర్‌గౌడ్, హన్మండ్లు తదితరులు ఉన్నారు.

వాతావరణంలో మార్పులతో కోళ్లు మృతి


మల్కాపూర్‌లో కోళ్ల ఫారంను పరిశీలిస్తున్న పశువైద్యురాలు హేమశ్రీ

బీబీపేట: వాతావరణంలో ఉష్ణోగ్రత మార్పులతో కోళ్లలో వ్యాధి నిరోధకశక్తి తగ్గిపోయి మృతి చెందుతున్నాయని మండల పశువైద్యురాలు హేమశ్రీ అన్నారు. శనివారం మండలంలోని మల్కాపూర్, తుజాల్‌పూర్, బీబీపేటలో ఉన్నటువంటి కోళ్ల ఫారాలను ఆమె పరిశీలించారు. రాష్ట్రంలో కొన్ని ప్రాంతాలలో బర్డ్ ఫ్లూ వైరస్ ప్రభావం ఉన్నట్లు నిర్ధారణ జరిగిందని, బర్డ్ ఫ్లూ సోకిన కోళ్లలో ముక్కు నుంచి నీరు కారడం, రెక్కలకి పక్షవాతం, మెడ వాయడం వంటి లక్షణాలు కనిపించి చనిపోతాయన్నారు. పౌల్ట్రీ రైతులు ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. తమ ఫారంలో కోళ్లు చనిపోయినట్లైతే ఆకోళ్లను పడేయకుండా భూమిలో పాతిపెట్టాలని, దహనం చేయాలని సూచించారు. షెడ్లని శానిటైజేషన్ చేయాలని తెలిపారు. ఫారాల వద్దకు కొత్త వ్యక్తులు ఎవరైనా వస్తే అన్ని జాగ్రత్తలూ తీసుకొని లోనికి పంపాలని పేర్కొన్నారు. కోళ్లలో మార్పుల కనిపిస్తే పశువైద్యాధికారులకు సమాచారం అందించాలని తెలిపారు. ఆమె వెంట సిబ్బంది ఉన్నారు.

పశువులకు ఆహారంగా వరి పంట


వరి పంటను మేస్తున్న గొర్రెలు

నిజాంసాగర్(జుక్కల్): మండలంలోని వెల్గనూర్ గ్రామ శివారులోని కమ్మరి గోపాల్ వరి పంట ఎండిపోయింది. దీంతో శనివారం ఆపంట గొర్రెలకు ఆహారంగా మారింది. భూగర్భజలాలు తగ్గిపోవడంతో బోర్ల ఎత్తిపోవడంతో పంటలు చాలా చోట్ల ఎండుతున్నాయి.

వేల రూపాయలు పెట్టుబడి పెట్టి వేసిన పొలాలు చివరికి పశువులకు ఆహారంగా మారుతున్నాయి. రైతులకు అప్పులు మిగులుతున్నాయి.

బెట్టింగ్‌లకు పాల్పడితే చర్యలు తప్పవు

రాజంపేట : ఐపీఎల్ సీజన్ ప్రారంభమైన నేపథ్యంలో యువకులు, ప్రజలు బెట్టింగ్ యాప్స్, ఆన్‌లైన్ బెట్టింగ్, ప్రేడిక్షన్ ఛానల్స్‌పై అప్రమత్తంగా ఉండాలని ఎస్సై పుష్పరాజ్ సూచించారు. తెలియని యాప్‌లతో జాగ్రత్తంగా ఉండాలని, డబ్బులు పోగొట్టుకోవద్దని తెలిపారు. ఎవరైనా ఐపీఎల్ బెట్టింగ్ లకు పాల్పడితే స మాచారం అందించాలన్నారు. వారిపై చట్టరీ త్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

సాతెల్లిలో ఒకరు అదృశ్యం


గోపాల్

ఎల్లారెడ్డి: మండలంలోని సాతెల్లి గ్రామంలో ఓ వ్యక్తి అదృశ్యమైనట్లు ఎస్సై మహేష్ శనివారం తెలిపారు. వివరాలు ఇలా.. మెదక్ జిల్లా పోచమ్మరాల్ గ్రామానికి చెందిన కుమ్మరి గోపాల్ (54) సాతెల్లిలో కొద్ది రోజులుగా పొలం కౌలుకు చేస్తున్నాడు. ఈనెల 18న అతడు ఎవరికీ చెప్పకుండా ఇంటి నుంచి వెళ్లిపోయాడు. ఎంత వెతికిన అతడి ఆచూకీ లభించకపోవడంతో కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈమేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

క్రైం కార్నర్

వేర్వేరు ఘటనల్లో పలువురి మృతి


గజారం మృతదేహం

బాల్కొండ: మెండోరా మండలం బుస్సాపూర్–పోచంపాడ్ గ్రామాల మధ్యగల జాతీయ రహదారి 44పై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా.. భైంసా మండలం తిమ్మాపూర్ గ్రామానికి చెందిన జాదవ్ గజారం(32) మూడేళ్ల క్రితం కూలీ పనుల కోసం మెండోరా మండల కేంద్రానికి వచ్చాడు. ఈక్రమంలో శనివారం ఉదయం బుస్సాపూర్ నుంచి పోచంపాడ్ వైపు జాతీయ రహదారి 44పై నడుచుకుంటూ వెళ్తుండగా వెనుక నుంచి గుర్తుతెలియని వాహనం వచ్చి అతడిని ఢీ కొట్టింది. ఈ ఘటనలో అతడి తలకు తీవ్ర గాయాలై అక్కడిక్కడే మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని శవాన్ని పోస్టు మార్టం నిమిత్తం ఆర్మూర్ ప్రభుత్వాస్పత్రికి తరలించినట్లు మెండోరా ఎస్సై నారాయణ పేర్కొన్నారు.

అనుమానాస్పద స్థితిలో ఒకరు..

వేల్పూర్: మండలంలోని పచ్చలనడ్కుడ గ్రామంలో ఓ వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతిచెందాడు. ఎస్సై సంజీవ్ తెలిపిన వివరాలు ఇలా.. మహారాష్ట్రకు చెందిన శంకర్(32) కూలీ పని కోసం కొన్ని నెలల పచ్చలనడ్కుడకి వచ్చాడు. మహారాష్ట్రకు చెందిన బాలాజీ అనే వ్యక్తితో కలిసి ఒకే గదిలో నివాసముంటూ గ్రామంలో కూలీ పనులు చేసేవారు. గురువారం రాత్రి ఇద్దరు గొడవ పడగా చుట్టుపక్కల వారు సర్దిచెప్పారు. శనివారం ఉదయం వారి ఇంటి నుంచి దుర్వాసన రావడంతో గ్రామస్తులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. వెంటనే పోలీసులు వచ్చి ఇంట్లో చూడగా శంకర్ మృతిచెంది ఉండడాన్ని గుర్తించారు. మరో వ్యక్తి బాలాజీ లేకపోవడం, మృతుడి వివరాలు తెలిపేందుకు ఎవరూ లేకపోవడంతో అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. శవాన్ని పోస్టుమార్టం కోసం ఆర్మూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఘటనాస్థలాన్ని ఆర్మూర్ రూరల్ సీఐ శ్రీధర్‌రెడ్డి సందర్శించారు.

చేపల వేటకు వెళ్లి..


సాయిలు (ఫైల్)

మోపాల్: మండలంలోని మంచిప్ప గ్రామంలో ఓ వ్యక్తి చేపల వేటకు వెళ్లి ప్రమాదవశాత్తు చెరువులో పడి మృతిచెందాడు. ఎస్సై యాదగిరిగౌడ్ తెలిపిన వివరాలు ఇలా.. మంచిప్ప గ్రామానికి చెందిన సుంకరి సాయిలు (55), దండ్ల శ్రీను శుక్రవారం సాయంత్రం గ్రామంలోని కొండెం చెరువులో చేపలు పట్టేందుకు వెళ్లారు. సాయిలు చెరువులోకి దిగగా, శ్రీను కట్టపై ఉన్నాడు. చెరువులోకి దిగిన సాయిలు బురదలో కూరుకుపోయి ఊపిరాడక మునిగిపోయాడు. విషయాన్ని శ్రీను కుటుంబ సభ్యులకు తెలియజేశాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని సాయిలు కోసం గాలించగా, శనివారం మృతదేహం లభ్యమైంది. మృతుడి భార్య శారద ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు.

సాగర్ కాలువలో పడి..


సుభాష్ (ఫైల్)

రుద్రూర్: మండలంలోని రాయకూర్ గ్రామంలో ఓ వ్యక్తి ప్రమాదవశాత్తు సాగర్ కాలువలో పడి మృతిచెందాడు. ఎస్సై సాయన్న తెలిపిన వివరాలు ఇలా.. రాయకూర్ గ్రామానికి చెందిన మాగిరి సుభాష్ (40)కు గతంలో యాక్సిడెంట్ కావడం వల్ల కాలు విరిగి ఇంటి వద్ద ఉంటున్నాడు. ఈనెల 19న సాయంత్రం ఇంటి నుంచి వెళ్లిన సుభాష్ తిరిగి రాలేదు. 21న రాత్రి సులేమాన్ నగర్ శివారులోని సాగర్ కాలువలో అతడి మృతదేహం లభ్యమైంది. సుభాష్ కాలకృత్యాలు తీర్చుకోవడానికి వెళ్లగా, ఫిట్స్ రావడంతో ప్రమాదవశాత్తు కాలువలో పడి మృతి చెంది ఉంటాడని మృతుడి తండ్రి సాయిలు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈమేరకు శనివారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

చికిత్స పొందుతూ..


దినేష్ (ఫైల్)

రామారెడ్డి: రోడ్డు ప్రమాదంలో గాయపడిన ఓ వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా.. మండల కేంద్రానికి చెందిన పద్మ దినేష్ (52) మండల కేంద్రంలో ఆధార్, మీసేవ కేంద్రాన్ని నిర్వహిస్తున్నారు. దుకాణ పని నిమిత్తం అతడు బైక్‌పై శుక్రవారం కామారెడ్డి వెళ్లి, సాయంత్రం తిరుగుపయనమయ్యాడు. గొల్లపల్లి ఎక్స్ రోడ్డు సమీపంలో బైక్ అదుపుతప్పి అతడు కింద పడగా, ఎదురుగా వస్తున్న ఆటో ఢీకొట్టింది. ఈ ఘటనలో దినేష్‌తోపాటు ఆటోలో ఉన్న పెద్దబోయిన లింబాద్రి, అతడి భార్యకు గాయాలయ్యాయి. వెంటనే స్థానికులు వారిని కామారెడ్డి ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ దినేష్ మృతి చెందాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నరేష్ తెలిపారు.

జిల్లా కోర్టు ఎదుట ఒకరి ఆత్మహత్యాయత్నం

ఖలీల్‌వాడి: జిల్లా కేంద్రంలోని కోర్టు గేటు ఎదుట ఓ యువకుడు ఆత్మహత్యకు యత్నించినట్లు ఎస్‌హెచ్‌వో రఘుపతి శనివారం తెలిపారు. వివరాలు ఇలా.. నగరంలోని గౌతంనగర్‌కు చెందిన నర్సింగ్ ప్రస్తుతం హైదరాబాద్‌లోని బేగంబజార్‌లో నివాసం ఉంటున్నాడు. అతడి తండ్రి వ్యవసాయశాఖలో ఉద్యోగిగా పని చేస్తున్న సమయంలో మృతి చెందాడు. నర్సింగ్, కిరణ్ ఇద్దరు అన్నదమ్ములు కాగా, కిరణ్ కారుణ్య నియామకం కింద ఉద్యోగం పొందారు. దీంతో కిరణ్ నుంచి తనకు రూ.లక్ష ఇప్పించాలని జిల్లా కోర్టు ఎదుట నర్సింగ్ పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యకు యత్నించాడు. గతంలో ఇలాగే హైదరాబాద్‌లోని బేగంబజార్ పోలీస్‌స్టేషన్ వద్ద ఫైనాన్స్ వాళ్లు ఆటోను తీసుకువెళ్లారని పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యాయత్నం చేసినట్లు సమాచారం. కోర్టు ఎదుట ఆత్మహత్యకు యత్నించడంతో నర్సింగ్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్‌హెచ్‌వో తెలిపారు.

ధర్మారావ్‌పేట్‌లో ఒకరి ఆత్మహత్య

సదాశివనగర్(ఎల్లారెడ్డి): మండలంలోని ధర్మారావ్‌పేట్‌లో ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా.. ధర్మారావ్‌పేట్ గ్రామానికి చెందిన సుంకరి శంకర్(51) ఇంటి పరిస్థితి బాగా లేక గతంలో అప్పులు చేశాడు. అప్పులను తీర్చే మార్గం లేక శనివారం ఇంట్లో ఎవరు లేని సమయంలో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడికి కుమారుడు, భార్య లక్ష్మి ఉన్నారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై రంజిత్ తెలిపారు.

చోరీ చేశారు.. వైరల్ అవడంతో వదిలేశారు..



మోర్తాడ్: గుర్తుతెలియని దుండగులు పొక్లెయిన్‌ని చోరీ చేయగా, ఈ ఘటన సామాజిక మాధ్యమాల్లో వైరల్ కావడంతో వాహనాన్ని వదిలేశారు. వివరాలు ఇలా.. భీమ్‌గల్ మండలం జాగిర్యాల్‌లో చిన్నోళ్ల గంగాప్రసాద్ తన పొక్లెయిన్‌ని శుక్రవారం రాత్రి ఇంటి వెనుక ఉన్న ఖాళీ స్థలంలో నిలిపి ఉంచారు. శనివారం ఉదయం లేచి చూసేసరికి పొక్లెయిన్ కనిపించకపోవడంతో డ్రైవర్ తీసుకువెళ్లి ఉంటాడని భావించాడు. అంతలోనే డ్రైవర్ రావడం పొక్లెయిన్‌ను తాను తీసుకపోలేదని వెల్లడించడంతో చోరీకి గురైనట్లు గుర్తించి, పోలీసులకు ఫిర్యాదు చేశారు. చోరీ విషయం సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయ్యింది. దీంతో పొక్లెయిన్‌ని దొంగలు వేల్పూర్ మండలం పడగల్ క్రాస్‌రోడ్డు వద్ద పొదల్లో నిలిపి ఉంచగా, స్థానికులు గమనించి వాహన యజమానికి సమాచారం ఇచ్చారు. దీంతో పొక్లెయిన్‌ను వారు స్వాధీ నం చేసుకున్నారు. నిందితులను గుర్తించడానికి పో లీసులు సీసీ కెమెరాలను పరిశీలిస్తున్నట్లు తెలిసింది.

సైబర్ మోసాలపై అవగాహన


మాట్లాడుతున్న రామారెడ్డి ఏపీఎం ప్రసన్నకుమార్

సదాశివనగర్/రామారెడ్డి/పెద్దకొడప్‌గల్ : మానవ అక్రమ రవాణా, సైబర్ నేరాలు, పోక్సో చట్టాలు, లైంగిక అక్రమ రవాణా చట్టాలపై సదాశివనగర్, రామారెడ్డి ఏపీఎంలు రాజిరెడ్డి, ప్రసన్నకుమార్, పెద్దకొడప్‌గల్ ఇన్‌చార్జి ఏపీఎం దూప్యా అవగాహన కల్పించారు. శనివారం రామారెడ్డి రైతు వేదిక, సదాశివనగర్, పెద్దకొడప్‌గల్ మండల సమాఖ్య కార్యాలయంలో వీవోఏలు, సీఏలకు గ్రామసంఘం అధ్యక్షులకు ఒక రోజు శిక్షణ నిర్వహించారు. అపరిచితులకు ఓటీపీలు తెలుపొద్దన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ గ్రామాల అధ్యక్షులు, వీవోఏలు, సీసీలు పాల్గొన్నారు.

ఎండీఎం కార్మికులకు రూ. 10వేల వేతనం చెల్లించాలి


డీఈవోకు వినతిపత్రం అందజేస్తున్న కార్మికులు

కామారెడ్డి టౌన్: మధ్యాహ్న భోజన కార్మికులకు రూ. 10 వేల వేతనం ఇవ్వాలని మధ్యాహ్న భోజన కార్మికుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు చక్రపాణి డీఈవో ఎస్.రాజుకు వినతిప్రతం అందజేశారు. ఈనెల 26న ఎండీఎం కార్మికుల సమస్యల పరిష్కారం కోసం చలో హైదరాబాద్ ఇందిరాపార్క్ వద్ద నిరసన కార్యక్రమం చేపడుతున్నట్లు తెలిపారు. ఈ నిరసనకు జిల్లాలోని కార్మికులు తరలి వచ్చి విజయంతం చేయాలని కోరారు. చలో హైదరాబాద్ కార్యక్రమానికి తరలివెళ్లేందుకు ఒక రోజు అనుమతి ఇవ్వాలని డీఈవోకు కోరారు. కార్మికులు అంబవ్వ, సంగీత తదితరులున్నారు.

ఆశ్రయమిచ్చిన ఇంటికే కన్నం!

- రూ.2.50లక్షలు చోరీ చేసిన నిందితుడు
- ఆలస్యంగా వెలుగులోకి ఘటన

లింగంపేట(ఎల్లారెడ్డి): పని కోసం వచ్చిన ఓ వ్యక్తి, ఆశ్రయమిచ్చిన ఇంట్లోనే చోరీకి పాల్పడిన ఘటన మండలంలోని నల్లమడుగు గ్రామంలో చోటుచేసుకుంది. చోరీ ఘటన ఆలస్యంగా వెలుగులోకి రాగా, బాధితుడు తెలిపిన వివరాలు ఇలా.. నల్లమడుగు గ్రామానికి చెందిన ఎట్టం సిద్ధయ్య నూతన ఇల్లు నిర్మాణం చేపట్టాడు. ఈనెల 19న కన్నాపూర్ గ్రామానికి చెందిన శ్రీకాంత్ అనే వ్యక్తి తనకు కూలీ పని ఇవ్వాలని అతడిని ప్రాధేయపడ్డాడు. దీంతో అదేరోజు రాత్రి శ్రీకాంత్ ఇసుక మోశాడు. కుటుంబ సభ్యులు ఊరికి వెళ్లగా, సిద్ధయ్య ఇంట్లో ఒక్కడే నిద్రపోయాడు. శ్రీకాంత్ అదును చూసి సిద్ధయ్య దాచిన తాళాల గుత్తి తీసుకొని, బీరువాలో దాచిన రూ. 2.50 లక్షలు నగదు, 2 జతల వెండి పట్టగొలుసులు, మొబైల్ ఫోన్‌ను చోరీ చేశాడు. బయటకు వచ్చి అదే గ్రామానికి చెందిన పరిచయస్తుడు శంకరయ్య ఇంటికి వెళ్లి తన భార్య ఆరోగ్యం బాగో లేదని, ఇంటికి వెళ్లడానికి బైక్ ఇవ్వమని కోరాడు. దీంతో అపహరించిన సొమ్ము, బైక్‌తో అతడు పారిపోయాడు. మరుసటి రోజు చోరీని గుర్తించిన సిద్ధయ్య పోలీసులను ఆశ్రయించాడు. పోలీసులు చోరీ ఘటనను గోప్యంగా ఉంచడం విశేషం. ఈ విషయాన్ని ఇన్‌చార్జి ఎస్సై ప్రకాష్‌నాయక్‌ను వివరణ కోరగా చోరీ జరిగిన విషయం వాస్తవమేనన్నారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టినట్లు తెలిపారు.

యాప్ డౌన్‌లోడ్ చేస్తే.. రూ.లక్ష మాయం

బీబీపేట: సోషల్ మీడియాలో వచ్చిన ఓ యాప్‌ను ఓపెన్ చేసి డౌన్లోడ్ చేసిన వెంటనే ఓ వ్యక్తి అకౌంట్ నుంచి డబ్బులు మాయమయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా.. బీబీపేటకు చెందిన బొల్లంగారి వెంకటేష్ వాట్సప్ గ్రూపుల్లో వచ్చిన 'పీఎం కిసాన్ యోజన ఏపీకే' ఫైల్ పేరుతో రాగా దానిని ఓపెన్ చేసి డౌన్లోడ్ చేశాడు. దీంతో మొబైల్‌కి నెట్వర్క్ బంద్ అయింది. వెంటనే కొత్త సిమ్ తీసుకొని మళ్లీ యాప్‌లు అన్ని డౌన్లోడ్ చేసుకున్నాడు. ఫోన్‌పేలో బ్యాంక్ బ్యాలెన్స్ చూడగా జీరో బ్యాలెన్స్ కనపడింది. వెంటనే బ్యాంకుకు వెళ్లి పరిశీలించగా అకౌంట్‌లో ఉన్నటువంటి రూ. 1,07,420 డబ్బులు పోయాయి. దీంతో వెంకటేష్ 1930 నంబర్‌కు కాల్ చేసి ఫిర్యాదు చేశాడు. ఈమేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ప్రభాకర్ తెలిపారు.

ఆందోళన విరమించిన ప్రియురాలు

లింగంపేట(ఎల్లారెడ్డి): మండలంలోని కోమట్‌పల్లి గ్రామంలో భర్త కాపురానికి తీసుకెళ్లడంలేదని భార్య చేపట్టిన ఆందోళన శనివారం విరమించినట్లు గ్రామస్తులు తెలిపారు. లింగంపేట మండలం కేశాయిపేట గ్రామానికి చెందిన నెల్లూరి భాగ్య, కోమట్‌పల్లి గ్రామానికి చెందిన చీటూరి రాకేష్ 2023లో యాదగిరిగుట్టలో ప్రేమ వివాహం చేసుకున్నారు. రాకేష్ ఇంటి ముందు శుక్రవారం టెంటు వేసుకొని భార్య భాగ్య ఆందోళనకు దిగింది. భాగ్య ఆందోళన చేపట్టిన విషయం పోలీసులకు తెలియడంతో వారు కోమట్‌పల్లి గ్రామానికి చేరుకొని ఇరు వర్గాల వారికి కౌన్సిలింగ్ ఇచ్చారు. దీంతో రాకేష్ తనతో భార్యను తీసుకెళ్లడానికి అంగీకరించాడు. భాగ్య ఆందోళన విరమించినట్లు తెలిపారు.